## క్లుప్తంగా

### ఏఐఎఫ్‌బీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న జోజిరెడ్డి

కరీంనగర్: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం సంఘ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి జెండా ఆవిష్కరణ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దెల్లి శేఖర్, ముత్యాల విజయ్‌కుమార్, రాజశేఖర్‌గౌడ్, శంకర్, సత్యరావు, మల్లారెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిపాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాశం తిరుపతి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఆసిరి తిరుపతి, నాయకులు గాలిపల్లి నారాయణ, కాల్వ రాంచంద్రం, పుట్టపాక శ్రీధర్, వెంకటేశ్, పెద్ది లక్ష్మణ్, సాయిచంద్, కార్తికేయ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

### డొమెస్టిక్ ఆర్వో ప్యూరీఫైయర్ అందజేత



విద్యానగర్(కరీంనగర్): వరల్డ్ హైడ్రోగ్రఫీ డే పురస్కరించుకుని గురువారం అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137, వాసుదేవ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఓ కుటుంబానికి డొమెస్టిక్ ఆర్వో ప్యూరీఫైయర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, అలయన్స్ క్లబ్ బాధ్యులు ఇంజినీర్ కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వర్, చీకోటి శ్రీనివాస్, చెరిమల వెంకటేశ్వర్లు, పండుగ నాగరాజు, సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

### టీ9 టికెట్‌తో రూ.20-40 ఆదా

విద్యానగర్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పల్లెవెలుగు బస్సుల్లో ప్రవేశపెట్టిన టీ9 టికెట్‌తో రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుందని రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత తెలిపారు. మహిళలు, వృద్ధులకు ఈ అవకాశం వర్తిస్తుందని, రూ.100 చెల్లించి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య టీ9 టికెట్ కొనుగోలు చేసి సాయంత్రం 6 గంటల వరకు ఉపయోగించుకోవచ్చని అన్నారు.

## సమాచారం

### నేడు నీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్‌కార్పొరేషన్: పలు మరమ్మతుల కారణంగా కరీంనగర్‌లోని హైలెవెల్ పరిధిలో శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఈఈ బి.మహేందర్ తెలిపారు. ఫిల్టర్‌బెడ్ నుంచి ఎంబీఆర్‌కు నీటిసరఫరా చేసే పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీక్ అవుతుందన్నారు. వాల్వ్ మరమ్మతులు చేపడుతున్నందున హైలెవెల్ పరిధిలోని రాంనగర్, మల్కాపూర్, కోర్టు, ఎస్ఆర్ఆర్ కాలేజ్, అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్‌ల పరిధిలోని డివిజన్‌లకు నీటిసరఫరాలో అంతరాయం జరుగుతుందని తెలిపారు. హైలెవెల్ జోన్ డివిజన్‌ల ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

### చిన్న సాయిబాబా వార్షికోత్సవం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని శ్రీవిజయగణపతి సాయిబాబా ఆలయంలో శుక్రవారం చిన్న సాయిబాబా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు గణపతి సాయి సమస్తదేవతల హోమాలు, మంగళస్నాన అభిషేకాలు, అర్చనలు, మధ్యాహ్నం అన్నదానం జరుగుతాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# సర్వేతో సరిపెట్టారు!

- క్రమబద్ధీకరణకు నోచుకోని గ్రామకంఠం భూములు
- ఏడాది క్రితం సర్వే చేసిన అధికారులు
- రికార్డులు లేక పట్టాల జారీలో జాప్యం
- క్రయవిక్రయాలు లేక యజమానుల ఆందోళన




గ్రామకంఠం భూమిలో నిర్మించిన నగునూరు గ్రామపంచాయతీ భవనం

కరీంనగర్‌రూరల్: గ్రామకంఠం భూములను క్రమబద్ధీకరించడంలో జాప్యమేర్పడుతోంది. ఈ భూములకు యాజమాన్య హక్కులను కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏడాది క్రితం సర్వే చేపట్టింది. కరీంనగర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామకంఠం భూములపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వే నిర్వహించారు. గ్రామకంఠం పరిధిలో మొత్తం 211.35 ఎకరాలుండగా 52.18 ఎకరాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీహాల్స్, రోడ్లు, వాటర్‌ట్యాంకులు, ఇతర ప్రభుత్వ కట్టడాలు నిర్మించారు. ఇంకా మిగితా 159.17 ఎకరాలు యజమానుల ఆధీనంలో ఉన్నాయి. నల్లగుంటపల్లి, మందులపల్లి గ్రామాల్లో గ్రామకంఠం భూములు లేవు. ఎక్కువగా నగునూరులో 23.25 ఎకరాలు, చెర్లభూత్కూర్‌లో 22.35, మొగ్దుంపూర్‌లో 17.35, దుర్శేడ్‌లో 16.18, చామనపల్లిలో 11, జూబ్లీనగర్‌లో 10 ఎకరాల చొప్పున ఉన్నాయి. మిగితా గ్రామాల్లో తక్కువ విస్తీర్ణంలో భూములున్నాయి. ఆర్నెళ్ల క్రితం గ్రామకంఠం భూములను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పటివరకు ఈ భూములను క్రమబద్ధీకరించి పట్టాలు పంపిణీ చేయకపోవడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రికార్డులు లేక ఇబ్బంది**

పంచాయతీల పరిధిలోని గ్రామకంఠం భూములకు చాలా చోట్ల రికార్డులు లేకపోవడంతో యజమానులకు తలనొప్పిగా మారింది. కొందరి ఇళ్లు మాత్రమే రికార్డుల్లో ఉంటే సమీపంలోని ఖాళీస్థలం, ఇంటి పెరడు, కొట్టం వంటి వాటి వివరాలు ఉండటం లేదు. కొన్ని దశాబ్దాల నుంచి యజమానులు, వారసులు కబ్జాలో ఉంటున్నారు. అయితే ఈ భూముల క్రయవిక్రయాలకు అవకాశం లేకపోవడం యజమానులకు ఇబ్బందిగా మారింది. ఎవరైనా స్థలం కొనుగోలు చేసినప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేకపోవడంతో పాటు బ్యాంకురుణాలు మంజూరు కావు.

**క్రమబద్ధీకరణలో జాప్యంతో ఆందోళన**

గ్రామకంఠాల్లోని పెరడు, ఖాళీస్థలాలను క్రమబద్ధీకరించి చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం ఏడాది క్రితం సర్వే నిర్వహించింది. పంచాయతీల రివిజన్ రికార్డుల నకళ్లను తీసుకుంది. రికార్డుల్లో లేని భూములకు యాజమాన్య హక్కులు వస్తాయని సంతోషపడిన గ్రామస్తులకు నిరాశే మిగిలింది. దీంతో ఆందోళన చెందుతున్నారు. అయితే భూముల వివరాలు రికార్డుల్లోకి చేరితే క్రయవిక్రయాలకు అవకాశముంటుంది. అంతేకాకుండా ఇళ్లు నిర్మించుకుంటే బ్యాంకుల నుంచి రుణాలు పొందే వీలుంటుంది.

**ప్రభుత్వానికి నివేదిక**

గ్రామకంఠం పరిధిలోని ఖాళీ స్థలాలను సర్వే చేశాం. పంచాయతీలవారీగా భూముల వివరాల జాబితాను ప్రభుత్వానికి పంపించాం. అన్ని పంచాయతీల రివిజన్ రికార్డుల నకళ్లను ఉన్నతాధికారులకు అందించాం. ఇప్పటివరకు గ్రామకంఠం భూముల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. – సీహెచ్. జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

## ఆధ్యాత్మికం

### వైభవంగా వరుణ అభిషేకం.. హోమం



లోక కల్యాణార్థం వర్షాలు కురవాలని కోరుతూ నగరంలోని బైపాస్ రోడ్డులో గల పంచముఖ హనుమదీశ్వర ఆలయంలో గురువారం జ్యోతిష్యవాస్తు ఆగమ శాస్త్ర పండితుడు నమిలికొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో వరుణ అభిషేకం, హోమం నిర్వహించారు. ఆరుద్రకార్తె, ఆశ్లేషా నక్షత్రం, ఆంజనేయస్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం, గ్రహ, ప్రకృతి, వరుణ ఆరాధనలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

### వంకాయ మాలలతో అలంకరణ



కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాఢమాసం శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని వంకాయల మాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు విశేష హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు. - విద్యానగర్(కరీంనగర్)

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనానికి యత్నం

- తెలంగాణచౌక్‌లో అడ్డుకున్న పోలీసులు
- ఆగ్రహంతో బీఆర్ఎస్ ఫ్లెక్సీలను చించిన కాంగ్రెస్ కార్యకర్తలు



దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

కరీంనగర్‌టౌన్: దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ పార్టీ ప్రజాధనాన్ని వృథా చేస్తోందని, ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన 10 హామీలను విస్మరించినందుకు నిరసనగా టీపీసీసీ పిలుపుమేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణచౌక్‌లో కేసీఆర్ విస్మరించిన 10 హామీలను సూచిస్తూ ఏర్పాటు చేసిన పది తలల రావణ కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే తెలంగాణచౌక్‌కు చేరుకున్న పోలీసులు దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. దిష్టిబొమ్మను అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పీసీసీ అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు మేనేని రోహిత్‌రావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ప్రధానంగా రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, నిరుద్యోగుల ఉద్యోగాలు, గిరిజన, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పోడు భూముల పట్టాల పంపిణీ లాంటి అనేక హామీలు అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకొని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ తాజ్, పడాల రాహుల్‌గౌడ్, కర్ర సత్య ప్రసన్నారెడ్డి, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్‌కుమార్, సమద్ నవాబు, రహమతు హుస్సేన్, ఎస్ఏ.మోసిన్, అబ్దుల్ రహమాన్, బోనాల శ్రీనివాస్, కుర్ర పోచయ్య, సయ్యద్ అఖిల్, లింగంపల్లి బాబు, సలీముద్దీన్, గడ్డం విలాస్ రెడ్డి, మేకల నర్సయ్య, ఎండీ చాంద్, దండి రవీందర్, మామిడి సత్యనారాయణరెడ్డి, విక్టర్, దన్ను సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరులకు నివాళి




నివాళి అర్పిస్తున్న ఫార్మసీ కళాశాల సిబ్బంది



కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో..



కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో..

కరీంనగర్ సిటీ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అమరవీరుల స్తూపం నమూనా వద్ద పూలు సమర్పించారు. ఆచార్య జయశంకర్, కాళోజీ నారాయణరావు, అమరవీరుల సేవలు, కృషిని నెమరువేసుకున్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిశోర్, ప్రిన్సిపాల్ కె.శ్రీశైలం, విభాగాధిపతి కె.సునీత, అధ్యాపకులు బి.భాగ్యలక్ష్మి, జీఎల్.అర్చన, అనిల్‌కుమార్, ఏ.శ్రీనివాస్‌నాయక్, క్రాంతి రాజు, జి.నిఖిత, ఆర్.రజిత, దుర్గాశివాని, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయం, కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయాల్లో అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో స్పందన, మండల ఎంపీటీసీలు దావ కమలా మనోహర్, కొమ్ము హేమలత, పండుగ గంగమ్మ, శారద, మంద రమేశ్‌గౌడ్, సర్పంచులు సంపత్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో బీజేపీ ఇంటింటా ప్రచారం



భాగ్యనగర్‌లో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కరీంనగర్‌టౌన్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు చేర్చాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని గురువారం నగరంలో బీజేపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు అందజేసి మోదీ పథకాలను ప్రచారం చేశారు. 56వ డివిజన్, భాగ్యనగర్‌లో పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ స్టిక్కర్లు అంటిస్తూ, మోదీ పరిపాలనకు మద్దతుగా మిస్డ్‌కాల్స్ చేపిస్తూ ప్రచారం నిర్వహించారు. నాయకులు ఎడమ సత్యనారాయణరెడ్డి, కొండం వెంకటరెడ్డి, గోలి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రేకుర్తిలో..

రేకుర్తిలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి జాడి బాలారెడ్డి, అధ్యక్షుడు ఎం.లక్ష్మీరాజం ఆధ్వర్యంలో తొమ్మిదేళ్ల మోదీ పరిపాలన, పథకాల గురించి వివరిస్తూ డోర్ స్టిక్కర్స్ అంటిస్తూ ప్రచారం నిర్వహించారు. నాయకులు మోహన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'కేబుల్ బ్రిడ్జి అంచనాలు పెంచి ప్రజాధనం వృథా చేశారు'



మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో నిర్మించిన కేబుల్ బ్రిడ్జిని అంచనాలు పెంచి ప్రజాధనం వృథా చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ ఆరోపించారు. గురువారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.164 కోట్లతో నిర్మాణం మొదలు పెట్టిన కేబుల్ బ్రిడ్జి పూర్తయ్యే సరికి రూ.224 కోట్ల అంచనాలకు చేరిందన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం అంచనాలు పెంచారో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి చుట్టూ వందల ఎకరాల భూములు ఎవరివి ఉన్నాయో సీబీఐ ద్వారా విచారణ జరపాలన్నారు. అంతర్గత రోడ్లు ఐదేళ్లయినా పూర్తికాలేదని, వాటి దుస్థితిపై కార్యాచరణ రూపొందించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, బంగారి రాజేంద్రప్రసాద్, కచ్చు రవీందర్, కొలగాని శ్రీనివాస్, జితెందర్, కాసర్ల ఆనంద్, పాదం శివరాజ్, ఆవుదుర్తి శ్రీనివాస్, హరి తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలు విజయవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు ఎంపీడీవో సీహెచ్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో దశాబ్ది ఉత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 2నుంచి 22 వరకు నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంతగానో సహకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, తహసీల్దార్ కన్నం నారాయణ, పీఆర్ ఏఈ రమణారెడ్డి, సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, ఏపీవో శోభారాణి, ఎంపీటీసీ సభ్యులు వినయ్‌సాగర్, అంకమల్ల శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకోవాలి



శ్రీరంగప్రసాద్‌కు సన్మానం చేస్తున్న కళాశాల సిబ్బంది

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకొని ముందుకు సాగాలని శాతవాహన యూనివర్సిటీ పరీక్షల విభాగం అధిపతి ఎస్వీ శ్రీరంగప్రసాద్ అన్నారు. గురువారం నగునూరులోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ అమర వీరుల చిత్రపటాలను ప్రదర్శించి నివాళులర్పించారు. పదిరోజుల నుంచి నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం శ్రీరంగప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, ఏసీవో సుష్మ, స్టాఫ్ సెక్రటరీ రోజారమణి, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్య, కల్చరల్ కమిటీ సెక్రటరీ కవిత, లైబ్రేరియన్ మోహన్‌రావు, పీఆర్‌వో గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

## టీసీఎస్ సంస్థకు ఎంపికైన 'అల్ఫోర్స్' విద్యార్థినులు



విద్యార్థులను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి: టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీసీఎస్ కంపెనీ జాబ్‌మేళాలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థినులు రహత్ ఉన్నీసా బేగం, ఎ.కుసుమ, ఎం.అనుషా ఎంపికైనట్లు కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ టాస్క్ నిర్వహిస్తున్న శిక్షణ, కళాశాలలో ప్రథమ సంవత్సరం నుంచే నిర్వహిస్తున్న ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ప్రతిభావంతులుగా రాణిస్తూ వివిధ దేశీయ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్, టీపీవో విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, గంగాప్రసాద్, అధ్యాపక బృందం అభినందించారు.

### ఆర్టీసీ జోనల్ విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్‌గా బాబురావు



బాబురావును సత్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆర్టీసీ జోనల్ విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్‌గా బాబురావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ కమిటీ నాయకులు దొంత రాజయ్య, లచ్చిరాం నాయక్, శంకరయ్య, నల్లాల రామనర్సయ్య, జి.లక్ష్మయ్య, శంకరయ్య, రాములు ఆయనను కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు.

### 25న రజక హక్కుల పోరాట సభ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో ఈనెల 25న రజక హక్కుల ఆత్మగౌరవ పోరాట సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ తెలిపారు. గురువారం కరీంనగర్ మండలం నగునూరులో సభ కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యల సాధనకు ప్రత్యక్ష పోరాటంలో భాగంగా ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లోని రజక సహకార సంఘాలకు కార్పొరేషన్ ద్వారా నిధులను విడుదల చేయాలని కోరారు. పోరాట సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కొత్తకొండ శ్రీనివాస్, పెద్ద సురేందర్, అనిల్, మల్లేశ్, చిన్న సురేందర్, కిషన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఫిజికల్ పరీక్షలు

కరీంనగర్ సిటీ: తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2023లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో ఈ నెల 16 నుంచి నిర్వహించిన ప్రవేశ పరీక్షలు బుధవారంతో ముగిశాయని కన్వీనర్ డాక్టర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి జరిగిన పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారిలో బుధవారం 250 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్, ప్రసాద్, విశ్వవిద్యాలయం ఇంజనీర్ ప్రకాశ్ అభ్యర్థులను పరిచయం చేసుకుని పలు సూచనలు చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రెన్స్ టెస్ట్-2023 విజయవంతం చేయడంలో కృషి చేసిన శాతవాహన యూనివర్సిటీ వీసీ మల్లేశం, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాయమ అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డా.ప్రభాకర్‌రావు, రమేశ్, స్పోర్ట్స్‌బోర్డ్ సెక్రటరీ నజీముద్దిన్, రిటైర్డ్ పీడీ సత్యనారాయణ, పీడీ విజయకుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, కరీంనగర్ మహిళా డిగ్రీ కాలేజీ పీడీ శ్రీధర్‌రావు, పీడీ హరిరాం, అథ్లెటిక్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి పాల్గొన్నారు.